క్లుప్తంగా

'సీఐపై చర్యలు తీసుకోవాలి'

రామగిరి(నల్లగొండ): తమను ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులు పెడుతున్న నకిరేకల్ సీఐ రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన మచ్చ పోతుల వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాటికల్ గ్రామానికి చెందిన నోముల రామలింగయ్య, నోముల సైదులు పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తుంటే వారి మీద చర్యలు తీసుకోవాలని తాను, తన భార్య సరిత కోరగా.. పట్టించుకోకుండా సీఐ రాజశేఖర్ వారి వద్ద లంచాలు తీసుకుని తమ మీదనే తిరిగి కేసులు పెట్టి జైలుకు పంపాడని ఆరోపించారు. అనేక మార్లు జిల్లా స్థాయి, నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సీఐపై చర్యలు తీసుకోకపోతే ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్యాల: నీటి పారుదల శాఖ చిట్యాల సబ్ డివిజన్ లస్కర్, హెల్పర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొర్ల తిరుపతయ్య, ప్రధానకార్యదర్శిగా షేక్ మహబూబ్, ఉపాధ్యక్షుడిగా కానమైన మల్లేష్‌లు ఏకగ్రీవం ఎన్నికయ్యారు. నల్లగొండ డివిజన్ అధ్యక్షుడు దంతాల వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా చంద్రశేఖర్



మర్రిగూడ: మండల నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా కె.చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్ శనివారం హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

రంగరాజన్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

నార్కట్‌పల్లి : చిలుకూరు బాలజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు కఠినంగా శిక్షించాలని యాదగిరిగుట్ట ఆలయ విశ్రాంత ప్రధానార్చకుడు కారంపూడి లక్ష్మీనరసింహాచార్యులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అర్చకులు, ఉద్యోగులపై జరుగుతున్న దాడుల మీద సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపిక



బేబీ షాలినిని సన్మానిస్తున్న ఎస్‌ఐ విష్ణుమూర్తి

కనగల్: కనగల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ నిమ్మ బేబీ షాలిని పోలీస్ జాతీయ వాలీబాల్ క్రీడలకు మన రాష్ట్రం తరపున ఎంపికయింది. కాగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్‌ఐ విష్ణుమూర్తి, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆమెను అభినందించి శాలువాతో సన్మానించారు. మార్చి 7 నుంచి 11 వరకు హర్యానాలో జరగబోయే జాతీయ క్రీడల్లో షాలిని ఆడనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మర్రిగూడ : మండల పరిధిలోని రాంరెడ్డిపల్లిలో గల శ్రీసురమాంబ కంఠమహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మంగళవారం స్వామివారి కల్యాణం, గురువారం స్వామివారికి బోనాలు సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

నార్కట్‌పల్లి : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం హెల్త్ సబ్‌సెంటర్(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) ను సోమవారం డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌లోని రికార్డులు, రోగులకు పంపిణీ చేసే మందులు, పరిసరాలను పరిశీలించారు. మార్చి ఒకటి వరకు ఎన్‌క్యూఎ ఎస్ సర్టిఫికేషన్ కోసం అన్ని రకాల చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్లు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, ఫార్మసీ సూపర్‌వైజర్ వీరారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మమత, సూపర్‌వైజర్ మధుసూదన్ సిబ్బంది శేఖర్, నిర్మల తదితరులు ఉన్నారు.

కొత్త బస్టాండ్ నిర్మాణానికి కసరత్తు

- ప్రయాణికులకు అందుబాటులో లేని ప్రస్తుత బస్టాండ్
- మెయిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసేలా ప్రణాళిక
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే వీరేశం
- ఆమోదం కోసం ఎదురుచూపు



నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న బస్‌స్టేషన్

నకిరేకల్ : నిత్యం నకిరేకల్ కేంద్రంగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులకు ఇది శుభవార్తే అని చెప్పవచ్చు. నకిరేకల్ పట్టణంలో ప్రయాణికులు పడే కష్టాలను తీర్చేందుకు ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను మెయిన్ సెంటర్‌లో నిర్మించేందుకు అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అది కార్యరూపం దాల్చినట్లయితే ప్రయాణికుల కష్టాలు తీరినట్లే.

నల్లగొండ, సూర్యాపేట డిపోల బస్సులు మాత్రమే బస్ స్టేషన్‌లోకి..

నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్ పట్టణంలో సుమారు 40వేల పైగా జనాభా ఉన్నారు. నకిరేకల్ పట్టణ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రయాణికులకు బస్టాండ్ అందుబాటులో లేకపోవడంతో నిత్యం అవస్థలు పడుతున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు బస్సుల కోసం మెయిన్ సెంటర్ నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. నకిరేకల్ నుంచి హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం, మదిర, నల్లగొండ, సూర్యాపేట, సత్తుపల్లి, ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, మణుగురు, మిర్యాలగూడెం, కరీంనగర్ ప్రాంతాలకు నిత్యం 400 పైనే ఆర్టీసీ బస్సులు వెళుతుంటాయి. 10 వేల పైనే ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రైవేటు వాహనాల్లో మరో వెయ్యి మంది వరకు ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం నల్లగొండ, సూర్యాపేట ఆర్టీసీ డిపోల బస్సులు మాత్రమే బస్ స్టేషన్‌లోకి వెళుతున్నాయి.

బైపాస్ వద్ద దిగి నడక..

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నకిరేకల్ మీదుగా బైపాస్ నిర్మించడంతో రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సులు పట్టణంలోకి రావడం లేదు. నకిరేకల్ నుంచి అత్యవసర పరిస్థితుల్లో హైదరాబాద్, నల్లగొండ, ఖమ్మం, కోదాడ, విజయవాడకు వెళ్లాలన్నా, తిరిగి అక్కడి నుంచి నకిరేకల్‌కు రావాలన్న రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు ఆయా ప్రాంతాల నుంచి నకిరేకల్ పట్టణంలోకి బస్సులు రాకపోవడంతో 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న బైపాస్ వద్ద దిగి నరకయాతన పడుతున్నారు. 3 కిలో మీటర్లు కాలినడకన రావాలిస్న పరిస్థితి నెలకొంది. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో బస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సాక్షి దినపత్రికలో పలు దఫాలు కథనాలు ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే.

రవాణా శాఖ మంత్రి దృష్టికి ..

నిత్యం ప్రయాణికులు పడుతున్న బాధలు, వారి విజ్ఞప్తులకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం స్పందించారు. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ఉన్న పోలీస్ స్టేషన్‌ను ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోకి తరలించి పోలీస్ స్టేషన్ స్థలంలో అన్ని హంగులతో నూతన బస్‌స్టేషన్ నిర్మించాలని కోరుతూ ఇటీవలే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పించిన విషయం విదితమే. పోలీస్ స్టేషన్ ఆవరణలో శిథిలమై కూలుతున్న క్వార్టర్లను కలిపి పోలీస్ స్టేషన్ స్థలం, ప్రస్తుతం ఆర్టీసీ బస్ స్టేషన్ స్థలం కూడా సమానంగా ఉన్నాయని ప్రాథమికంగా గుర్తించారు. మెయిన్ సెంటర్‌లో బస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ప్రయాణికుల కష్టాలు తీరుతాయి. రాత్రి వేళల్లో కూడా అన్ని డిపోల బస్సులు పట్టణంలోకి వచ్చి వెళతాయి. పాలకులు స్పందించి త్వరగా బస్టాండ్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాత్రయితే నరకమే



నకిరేకల్ నుంచి నిరంతరం హైదరాబాద్‌కు వెళ్తుంటాం. రాత్రి 7గంటలు దాటితే హైదరాబాద్ నుంచి నకిరేకల్ మీదుగా వెళ్తున్న ఖమ్మం, విజయవాడ, మదిర, కొత్తగూడెం, భద్రాచలం డి పోల బస్సులకు నకిరేకల్‌లో స్టాప్ లేదు. రాత్రయితే ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు.

–ఎండీ ఫయీమ్, ప్రయాణికుడు నకిరేకల్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా..



ప్రయాణికులు నిత్యం పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్ష్యంగా గమనించా. మెయిన్ సెంటర్‌కు దూరంగా బస్ స్టేషన్ ఉండడంతో చౌరస్తా నుంచే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మెయిన్ సెంటర్‌లో బస్ స్టేషన్ నిర్మించాలని స్థానికులు నా దృష్టికి తెచ్చారు. ఇటీవలే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లా. ప్రభుత్వం నుంచి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాం.

– వేముల వీరేశం, నకిరేకల్ ఎమ్మెల్యే

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రవేశపెట్టిన పథకాలను, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కుల గణన పూర్తిగా తప్పుల తడకగా ఉందని, మళ్లీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఉందని, ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌ను ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు కష్టపడి ఐక్యంగా పనిచేస్తే భవిష్యత్ అంతా బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులు ప్రజలతో మమేకం కావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్, గడుసు కోటిరెడ్డి, పోగుల నర్సింహ, దాసరి సంజయ్, బీరెల్లి ప్రసాద్, గుర్రం సైదులు, గాజుల బుచ్చమ్మ, తవిడబోయిన భవాని, గుండగోని రాములు, అంతటి శ్రీను, మనోహర్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో నిలిచిన రిజిస్ట్రేషన్లు

మర్రిగూడ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. తహసీల్దార్ బక్క శ్రీనివాసులు వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవు పెట్టారు. అయితే తహసీల్దార్ సెలవు పెట్టినట్లయితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ డిప్యూటీ తహసీల్దార్ నిర్వహించేవారు. శనివారం డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్ బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీటీ కై. చంద్రశేఖర్‌కు లాగిన్ ఇవ్వకపోవడంతో సోమవారం రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. మంగళవారం రోజు లాగిన్ ఇస్తే బుధవారం నుంచి రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగనున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. మూడు రోజుల నుంచి స్లాట్ బుక్ చేసుకున్న వారు సోమవారం రోజు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

న్యాయం చేయాలని నిర్వాసితుల వినతి



తమ సమస్యలను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి తెలియజేస్తున్న చర్లగూడెం నిర్వాసితులు

మర్రిగూడ : శివన్నగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న చర్లగూడెం బాధితులకు, భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించడంతోపాటు పునరావాసం కల్పించాలని ఆ గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని మునుగోడు క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించేలా చొరవ చూపాలని, తమకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. తమ భూములు, గ్రామాన్ని సర్వస్వం కోల్పోయినప్పటికీ గత ప్రభుత్వంలో న్యాయం జరగలేదని నిర్వాసితులు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే.. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారని నిర్వాసితులు పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతులు అవలంబించాలి

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

త్రిపురారం: వరి సాగులో రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామంలోని రైతు వేదికలో కేవీకే కంపాసాగర్ ఆధ్వర్యంలో రైతులకు వరి సాగులో నేరుగా విత్తే పద్ధతిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేరుగా వరి విత్తనాలు విత్తడం వల్ల భూమిని కాపాడుకోవడంతోపాటుగా పెట్టుబడి ఖర్చులు తగ్గి రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. నీలాయిగూడెం గ్రామంలో నేరుగా విత్తే విధానంపై రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కొప్పోలు గ్రామంలో వరిచేను పరిశీలిస్తున్న ఏఓ పురుషోత్తం

కేతేపల్లి: వరిసాగులో రైతులు సకాలంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల బారిన పడకుండా పంటలు కాపాడుకోవాలని ఏఓ బి.పురుషోత్తం సూచించారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో యాసంగిలో రైతులు సాగు చేసిన వరి పొలాలను మంగళవారం ఆయన పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ నిర్ణీత సమయం కన్నా ముందుగా వరినార్లు పోయడం వల్ల పిలక దశలో అధిక చలి తీవ్రతతో పైరు సరిగా ఎదగక తల్లికర్ర ముందుగా ఈనడం జరుగుతుందన్నారు. తల్లి కర్ర ఈనడం గమనించినట్లయితే బూస్టర్ డోస్‌గా ఎకరాకు 30 కిలోల యూరియాను వెంటనే వేసుకోవాలన్నారు. పొలంలో జింక్‌లోపం కనిపించినట్లయితే 10 గ్రామాలు జింక్ సల్ఫేట్ మందును ఒక లీటర్ నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండుమార్లు పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట రైతులు వల్లపు మల్లయ్య, బుచ్చయ్య, సోమయ్య ఉన్నారు.

సీపీఎం నాయకుడు మృతి

నల్లగొండ టౌన్: సీపీఐఎం సీనియర్ నాయకుడు జినుకుంట్ల లింగయ్య (76) సోమవారం మృతిచెందాడు. దీంతో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు ప్రభావతి, నాగార్జున, సయ్యద్ హాశం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. లింగయ్య అంత్యక్రియలు కనగల్లు మండలం దర్వేశిపురం గ్రామంలో మంగళవారం జరుగుతాయని వారు తెలిపారు.

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం

మర్రిగూడ : పీడీఎస్ బియ్యం అక్రమ దందా చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పీడీఎస్ బియ్యాన్ని సేకరించి దందా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అద్దె బకాయిలు చెల్లించని షాపులకు తాళాలు



మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఓ దుకాణంలో అద్దె వసూలు చేయడానికి వచ్చిన అధికారులు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ఏడాదిన్నర కాలం నుంచి అద్దె బకాయిలు చెల్లించని ఎనిమిది షాపులను సోమవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ ఆదేశాల మేరకు మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో తాళాలు వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, ఆర్‌ఓ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల మున్సిపల్ కాంప్లెక్స్‌లోని 8 షాపుల వారు మొత్తం 10 లక్షల 89 వేల రూపాయల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. వీరికి నోటీసులు కూడా జారీ చేసినప్పటికి పట్టించుకోకపోవడంతో తాళాలు వేయాల్సి వచ్చిందన్నారు. అయితే అందులో ఐదు షాపుల నిర్వాహకులు బకాయిలు రాత్రి వరకు చెల్లించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సాజిద్, జూనియర్ అసిస్టెంటు మాజీద్, బిల్ కలెక్టర్ వేముల శ్రీనులతో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

వేతనాలు అందక అవస్థలు !

- రెండు నెలలుగా నిలిచిన జీతాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న చిట్యాల మున్సిపల్ సిబ్బంది



చిట్యాల మున్సిపల్ కార్యాలయం

చిట్యాల: మున్సిపాలిటీలో పనిచేసే వివిధ విభాగాల సిబ్బంది, కార్మికులకు సకాలంలో వేతనాలు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కుటుంబ గడవడం కూడా కష్టంగా మారింది. చిట్యాల మున్సిపాలిటీలో మంచినీటి సరఫరా విభాగం, కంప్యూటర్ విభాగం, టాక్స్‌లు వసూలు చేసే విభాగంతోపాటు వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు, పారిశుద్ధ కార్మికులు కలిసి 63 మంది వరకు ఉన్నారు. వీరందరికీ ఇప్పటి వరకు రెండు నెలల(డిసెంబరు, జనవరి) వేతనాలు అందలేదు. ఫిబ్రవరి 23వ తేదీ వస్తే మూడు నెలల వేతనాలు అందనట్లవుతుంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి నెలా సుమారు రూ.పది లక్షలకుపైగా..

చిట్యాల మున్సిపాలిటీలో పనిచేసే సిబ్బందికి ప్రతినెలా సుమారు రూ.పది లక్షలకుపైగా వేతనాలను మున్సిపాలిటీ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కానీ గత ఏడాది డిసెంబరు నెలతోపాటుగా ఈ ఏడాది జనవరి నెలకు సంబంధించిన వేతనాలు ఇప్పటి వరకు కార్మికులకు, ఉద్యోగులకు అందలేదు. డిసెంబరు నెలకు సంబంధించిన కార్మికుల వేతనాలను ఎస్‌టీఓ ద్వారా చెల్లించేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు.. కానీ ఆ వేతనాలు కార్మికుల, ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో నేటి వరకు జమకాలేదు. మరోవైపు మున్సిపల్ జనరల్ ఫండ్‌లో కార్మికులకు చెల్లించేందుకు అవసరమైన నిధులు లేకపోవడంతో వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో నెలవారీగా వచ్చే వేతనంతోనే కుటుంబ పోషణను నిర్వహించుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటి పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులు కోరుతున్నారు.

డిసెంబర్ వేతనాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేశాం

చిట్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు డిసెంబరు నెల వేతనాలను మున్సిపాలిటీ ఎస్‌టీఓ నిధుల ద్వారా ఇచ్చేందుకు ఏర్పాటు చేశాం. కానీ వేతనాలు వారి బ్యాంకు అకౌంటులలో జమ కాలేదు. కాగా మున్సిపల్ కార్మికులు జనరల్ ఫండ్ నిధుల ద్వారానే వేతనాలు చెల్లింపులు చేయాలని కోరడంతో జనవరి నెల వేతనాలు పెండింగ్ ఉన్నాయి.

– వీరేందర్, మున్సిపల్ కమిషనర్

బహుమతులు అందజేత



ట్రోఫీ అందజేస్తున్న సీఐ కొండల్‌రెడ్డి

కేతేపల్లి: యువతలో ఐక్యతను పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయని శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి అన్నారు. కేతేపల్లిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలైన జట్లకు సోమవారం ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన తుంగతుర్తి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కేతేపల్లి, కొత్తపేట జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం వై.నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

తిప్పర్తి : మండలంలోని మామిడాల గ్రామ మాజీ సర్పంచ్ కందిమళ్ల రాజిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. యాపలగూడం గ్రామంలో రాజిరెడ్డి మృతదేహాన్ని సోమవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడి, మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా

ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన

కనగల్ : మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు గాను ముసాయిదా ఓటరు జాబితాను మండల ప్రజా పరిషత్ కార్యాలయ నోటీస్ బోర్డులో ఎంపీడీఓ తులసి జయరాం మంగళవారం ప్రదర్శించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కే సుమలత, సూపరింటెండెంట్ అండాలు, జూనియర్ అసిస్టెంట్ గోవర్ధనబాయి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు సన్మానం



కవిత,దయాకర్‌లను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

నల్లగొండ: మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ల పదవీ కాలం ముగియడంతో సోమవారం నల్లగొండలోని 48వ వార్డు మాజీ కౌన్సిలర్ యామ కవితాదయాకర్ దంపతులను బీట్ మార్కెట్‌లో కాలనీ వాసులు, ఆర్యవైశ్యులు సన్మానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేతేపల్లి: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు జటంగి వెంకటనర్సయ్యయాదవ్ తల్లి జటంగి లింగమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. కాగా డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్ సోమవారం కేతేపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి లింగమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ డైరెక్టర్లు బయ్య ముత్తయ్య, ఎస్‌కే.లతీఫ్, మాజీ జెడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మ, అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి, జటంగి మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



చిట్యాల : క్యాలెండర్ విడుదల చేస్తున్న నాయకులు

రామగిరి(నల్లగొండ): తెలంగాణ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల నూతన డైరీని సోమవారం ఎన్జీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగి రమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ కార్యదర్శి డాక్టర్ బ్రిజేష్, టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ భాస్కర్, డాక్టర్ శంకర్, డాక్టర్ వాసం శ్రీనివాస్, డాక్టర్ ఎం.అనిల్ అబ్రహం, డాక్టర్ బొజ్జ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: శాలివాహన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను సోమవారం శాలివాహన సంఘం జిల్లా కార్యదర్శి తాడూరి చంద్రం, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి సతీష్ చిట్యాలలో విడుదల చేశారు. కార్యక్రమంలో భువని శాలివాహన సంఘం అధ్యక్షుడు అర్రూరి సత్తయ్య, నాయకులు కంభంపాటి నర్సింహ, అర్రూరి శ్రీనివాస్, కొలనుచెల్మి శంకరయ్య, అర్రూరి మల్లేష్ పాల్గొన్నారు.

గీతా మందిరంలో మన అమ్మ సారె



వడిబియ్యం, సారెతో వస్తున్న మహిళలు

నకిరేకల్ : పట్టణంలోని గీతా మందిరంలో మన అమ్మ సారె కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కాలనీలోని కారంకోటి రమ నర్సింగ్ వారి ఇంటి నుంచి మహిళలు వడి బియ్యం, సారెతో వచ్చి స్థానిక గీతా మందిరంలోని లక్ష్మీదేవి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గ ఆలయ చైర్‌పర్సన్ బ్రహ్మదేవర పద్మాకృష్ణమూర్తి, మన అమ్మ సారె నిర్వాహకులు రావిరాల కవితా, వెంకటలక్ష్మీ, చల్ల రమాదేవి, కాసర్ల లక్ష్మీ, రజిత, సరిత, లక్ష్మీ, ధనమ్మ, విజయ్ , ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

మర్రిగూడ : గ్రామాల్లో నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని రాంరెడ్డిపల్లి, సరంపేట గ్రామాల్లో నిర్వహించిన నీటి నాణ్యత వినియోగం సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు నజీరా, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో పూజలు



చెర్వుగట్టు ఆలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి సన్మానించారు. వీరి వెంట చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, పెద్ద అంబర్‌పేట్ కార్పొరేటర్ బలరాం, రేగట్టె మహేందర్‌రెడ్డి, మేరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మణ్‌లు ఉన్నారు.